నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | జనవరి 10, 2024 | www.navatelangana.com

పోగొట్టుకున్న స్మార్ట్ ఫోన్ అందజేత

నవతెలంగాణ-జుక్కల్

పోగొట్టుకున్న స్మార్ట్‌ఫోన్‌ను జుక్కల్ ఎస్సై సత్యనారాయణ ట్రేస్ చేసి బాధితునికి మంగళవారం అందజేశారు. ఎస్సై తెలిపిన వివిరాల ప్రకారం.. మండలంలోని పెద్దగుల్లా గ్రామానికి సంతోష్ డిసెంబర్ 15వ తేదీ 2023లో స్మాట్ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. జుక్కల్ పీఏస్‌లో ఫిర్యాదు చేయగా సిఈఐఆర్ యాప్‌తో ఈఎమ్ఐ నెంబర్ ఆధారంగా ఫోన్‌ను ఎవరు ఎక్కడ వినియోగిస్తున్నారో ట్రేస్ చేసి బాధితుడు సంతోష్ అందించారు. కార్యక్రమంలో జుక్కల్ ఎస్సై తో పాటు ఏఎస్సై, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడులు

- 16 మంది అరెస్ట్.. 39,470 స్వాధీనం చేసుకున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆరో పోలీస్ స్టేషన్ పరిధిలో పక్క సమాచారం మేరకు మంగళవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించగా 16 మంది పేకాటరాయలను అరెస్టు చేసి వారి వద్ద నుండి 39వేల 470 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ టాస్క్ ఫోర్స్ ఏసిపి రాజశేఖర్ రాజ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఏసీపి రాజశేఖర్ రాజ్ ఆధ్వర్యంలో సిఐలు అజయ్ బాబు, అంజయ్య, సిబ్బంది 6టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 మంది పేకాట రాయుళ్ల పట్టుకున్నట్టు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తము 6 టౌన్ ఎస్ హెచ్ ఓ కి అప్పగించడం జరిగింది.

'అపార్ట్‌మెంట్' స్కూళ్లతో ఆటలకు దూరం

- గ్రౌండ్ లేకుండానే అపార్ట్‌మెంట్‌లలో కొనసాగుతున్న పలు ప్రయివేటు, కార్పోరేట్ స్కూళ్లు
- పిల్లలను ఆటలకు దూరం చేస్తున్న వైనం
- జాతీయ స్థాయి కబడ్డీ పోటీల నేపథ్యంలో క్రీడలపై సర్వత్రా ఆసక్తి
- మామూలుగా తీసుకుంటున్న విద్యాశాఖాధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు, పాలకులు ఊకదంపుడు ఉపాన్యాసాలు ఇస్తూ.. అమల్లో మాత్రం చేతులెత్తేస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు జరుగుతున్న వేళ.. మరోసారి ఆటలకు ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మెజార్టీ స్కూళ్లల్లో గ్రౌండ్ లేదు. వెతికినా కంటికీ కనపడదు. కారణం.. అపార్ట్‌మెంట్‌లలో విద్యాసంస్థలు కొనసాగుతుండటం గమనార్హం. పిల్లలకు ఆటలు ఆడేందుకు సెల్లార్‌లే దిక్కుగా మారాయి. అసలు అపార్ట్‌మెంట్‌లలో స్కూళ్ల నిర్వహించేందుకు అనుమతులు ఎలా ఇచ్చారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. గ్రౌండ్ సదుపాయం కల్పించకున్నా ఇంకా ఎలా కొనసాగిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు 'మామూలు'గా తీసుకుంటూ వదిలేస్తుండటంతో కార్పోరేట్ స్కూళ్ల ఆడిందే ఆటగా, పాడిందే పాటగా మారింది.

ఎదుగుతున్న పిల్లలకు చదువు ఎంత అవసరమో క్రీడలు కూడా అంతే అవసరం. దాన్ని గుర్తించకుండా రాష్ట్రంలో తమ పాఠశాలనే నెంబర్ 1 గా ఉండాలని ఉద్దేశంతో కార్పొరేట్ స్థాయి విద్యాసంస్థలు పిల్లలను చదువుకు పరిమితం చేస్తూ వారి మెదడును ఎదగనివ్వడం లేదు. పిల్లలు ఎదగాలంటే శారీరక, మానసిక దృఢత్వం ఉన్నప్పుడే ఎదుగుతారు. అలాకాకుండా ఐఐటీ, జేఈఈ, ఒలిపియాడ్ అంటూ వీటిని పాఠశాలలో నిర్వహించరాదని తెలిసినా ఆయా పాఠశాలల యజమాన్యాలు వీటిని కొనసాగిస్తూ విద్యార్థులకు క్షణం తీరిక లేకుండా చేస్తున్నారు. దీంతో కొందరు విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారు.



పాఠశాలకు పర్మిషన్లు ఎలా ఇచ్చారు ?

జిల్లా కేంద్రంలో కొన్ని కార్పొరేట్ పాఠశాలలైన బ్రిలియంట్, గౌతమ్ మోడల్, కాకతీయ తదితర పాఠశాలలకు గ్రౌండ్ లేకున్నా అపార్టెంటల్ లో కొనసాగుతున్నా అధికారులు అటువైపు చూడటం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం.. స్కూల్ నిర్వహించేందుకు మొదటగా గ్రౌండ్ తప్పనిసరి. మొదటి అంశాన్నే పక్కన పడేసి నాలుగైదు అంతస్తులు ఉన్న అపార్ట్‌మెంట్‌లలో యథేచ్ఛగా స్కూళ్లను నడిపిస్తున్నారు. దీంతో ఆయా స్కూళ్లల్లోని విద్యార్థులు ఆటలకు పూర్తిగా దూరమవుతున్నారు. ఇంత జరుగుతున్నా.. జిల్లా కేంద్రంలో ఉండే డీఈవో, ఎంఈవోలు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఐదు మండలాలకు ఇన్‌చార్జీగా ఉన్న ఎంఈవో.. ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలయని పరిస్థితి ఉందని, ఏదైనా ఫిర్యాదు చేద్దామన్నా నిత్యం పర్యటనలో ఉంటూ తనిఖీలు చేపడుతున్నట్టు చెబుతున్నారని, అంతలా తనిఖీలు నిర్వహిస్తుంటే.. అపార్ట్‌మెంట్‌లలో కొనసాగుతున్న విద్యాసంస్థలు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

ఫీజుల నియంత్రణ లేదు

నిబంధనలు పాటించకున్నా.. ఫీజులు మాత్రం ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఎల్‌కేజీ, యూకేజీకి సైతం వేలల్లో ఫీజులు వసూలు చేస్తు విద్యను వ్యాపారంగా మార్చేశారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారు. పాఠశాలల్లో గవర్నర్ బాడీ ఉండదు, పాఠశాలలో ఏమి జరిగినా ఎవరు వచ్చి అడిగే పరిస్థితి లేదు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖాధికారులు ఇంకా చోద్యం చూస్తారో లేకుంటే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి

ముడుపులకు ఆశ పడుతున్న విద్యాశాఖ అధికారులు

ఎస్ఎఫ్ఐ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు అరుణ్



కామారెడ్డి జిల్లా కేంద్రంలో కార్పొరేట్ పాఠశాలకు ఆటస్థలం లేకుండానే అధిక ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలలను కొనసాగిస్తున్నారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి సంబంధించిన అటువంటి ఆటస్థలం లేని పాఠశాలల గుర్తింపుని వెంటనే రద్దు చేయాలి. పాఠశాల ఒకచోట ఆటస్థలం మరోచోట ఉన్నాయి. కొన్ని పాఠశాలలకు ఆటస్థలాలు లేవు. కార్పొరేట్ పాఠశాలలు వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. తెలిసినా జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం వారిపై చర్యలు తీసుకోవడంలేదు. వెంటనే అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.

తనిఖీలు చేపట్టాలి

ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్



చాలా పాఠశాలలకు (గ్రౌండ్) ఆట స్థలం లేకపోయినా స్కూలు నడిపిస్తున్నారు. ఒక విద్యార్థి మానసికంగా, శారీరకంగా దఢంగా కావడానికి ఆటలే ముఖ్యం. ఆటలు కేవలం జనవరి 26 కోసం, ఆగస్టు 15 కోసం కాకుండా ప్రతి పాఠశాలలో ప్రతిరోజు ఒక క్లాసు సమయం ఆటలకు కేటాయించాలి. విద్యాశాఖాధికారులు తక్షిక తనిఖీలు చేపట్టి నిబంధనలకు అనుగుణంగా లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి.

కస్టడీలో ఉన్న దొంగ పరార్

- డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఘటన
- జల్లెడ పడుతున్న పోలీసులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



హైవే వెంట తనిఖీలు చేపట్టిన పోలీసులు..



జాగిలాలతో..

పోలీస్ కస్టడీలో ఉన్న ఓ దొంగ పరారయ్యాడు. ఈ ఘటన డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం జక్రాన్ పల్లి మండల సమీపంలోని అర్గుల్ జాతీయ రహదారి 44పై తాజాగా గొలుసు చోరీ చోటు చేసుకుంది. ఈ ఘటనలో హర్యానా రాష్ట్రానికి చెందిన ఓ నిందితుడిని ఐడి పార్టీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అనంతరం డిచ్‌పల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం పక్కనే ఉన్న డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ కస్టడీలో నిందితుడిని ఉంచి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఉదయం నిందితుడు బాత్రూంకి వెళ్తానని చెప్పగా స్టేషన్ లోని సిబ్బంది అతన్ని లాకప్ నుంచి బయటకు తీశారు. ఆ తర్వాత నిందితుడు పారిపోయాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బందాలుగా ఏర్పడి నిందితుడి కోసం జాగిలలతో గాలిస్తున్నారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఎసిపి కిరణ్ కుమార్ డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివరాలు ఆరా తీశారు. ఈ ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. ఇదే విషయమై పోలీసులను సంప్రదించేందుకు ప్రయత్నించగా.. స్పందించడం లేదు.

ఎంపీపీపై అవిశ్వాసానికి సన్నాహాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



గత నాలుగేళ్లుగా ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా కొనసాగిన ఇద్దరిపై 12 మంది ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానానికి సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. నిజామాబాద్ ఆర్డీవోకు అవిశ్వాస తీర్మాన కాపీని అందజేశారు. దానిలో భాగంగానే తిరిగి రిజిస్టర్‌ను మండల పరిషత్ కార్యాలయానికి పంపించారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిషత్ అధ్యక్షుడు(ఎంపీపీ) గద్దె భూమన్న పై అవిశ్వాసం పెట్టేందుకు గత కొన్ని నెలల నుండి ఎంపీటీసీలు ఎదురు చూస్తున్నారు. ఈ మేరకు కొందరు ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసానికి అనుమతి ఇవ్వాలని నిజా మాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్‌ను సోమవారం కలిసి లేఖ అందించారు. మొత్తం ఎంపీటీసీ సభ్యులు 17 మంది ఉండగా 13 మంది అవిశ్వాసానికి మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. అవిశ్వాసానికి సంతకాలు చేసిన వారిలో ఎంపీటీసీలు, ఉగ్గెర కృష్ణవేణి,నర్సింగ్ రావు పులి, రాజమణి సాకలి,గండోల్ల సుప్రియ, దుంపాల సౌమ్య, అల్లుల్ల బాలగంగాధర్, చిన్నోల్ల నర్సయ్య పోతర్ల సూజత,రాతోడ్ బిక్య గోదవరి సాంపల్లి,ఎంబడి సంతోషం, అప్పల మంజుల,దండుగుల సాయిలు ఉన్నారు.

ప్రస్తుతం ఎంపీపీగా ఉన్న గద్దె భూమన్న వైస్ ఎంపీపీగా ఉన్న శ్యామ్ రావు బి ఆర్ ఎస్ నుండి గెలుపొంది బిజెపిలోకి వెళ్లారు. 13 మందిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఎంపీటీసీలు అవిశ్వాసానికి సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు ఎంపిటిసిలు కీలు పొందారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పలువురు ఎంపీటీసీలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొని అవిశ్వాసానికి రెడీ అయ్యారు. మొత్తం 17 మంది ఎంపీటీసీలకు గాను 13 మంది అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు. మిగతా నలుగురు అవిశ్వాసానికి దూరంగా ఉన్నట్లు తెలిసింది. ప్రక్రియ పూర్తయిన తర్వాత అవిశాస్వం నిర్వహించేందుకు తేదీని ఖరారు చేయనున్నారు.

నేడు మండల సభ

- హాజరుకానున్న ఎమ్మెల్యే
- డివిజన్ అధికారులు హాజరయ్యేనా..?



మాట్లాడుతున్న ఎంపీపీ రాజ్‌దాస్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో నేడు (బుధవారం) మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ రాజ్‌దాస్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరుకానున్నట్టు తెలిపారు. కావున అధికారులు తమ పూర్తి నివేదికలతోహాజరు కావాలని, సభ్యులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. సమావేశంలో జెడ్పిటిసి మనోహర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షాహిద్ పాష, సర్పంచ్ బాల్‌రెడ్డి ఉన్నారు.

డివిజన్ స్థాయి అధికారులు హాజరయ్యేనా

నేడు మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ హాజరుకానున్న నేపథ్యంలో సమావేశానికి డివిజన్ స్థాయి అధికారులు హాజరు అవుతారా.. లేకుంటే గతం లాగే కేవలం మండల స్థాయి అధికారులు మాత్రమే హాజరవుతారా.. అని వేచి చూడాల్సి ఉంది. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి డివిజన్ స్థాయి అధికారులు హాజరైతే తప్ప సమస్యలు పరిష్కరించబడవు. కానీ ప్రతి సమావేశానికి కేవలం మండల స్థాయి అధికారులు మాత్రమే హాజరు కావడం ఆనవాయితీగా వస్తుంది. నేడు నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశానికి డివిజన్ స్థాయి అధికారులు హాజరవుతారా లేదా అని వేచి చూడాల్సి ఉంది.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి



ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను ఎస్ఐ సుధాకర్ బాధితునికి మంగళవారం అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన బి నవీన్ గత సంవత్సరం నవంబర్ 11న సెల్ఫోన్ పోగొట్టుకొని, మరుసటి రోజు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, సి ఈ ఐ ఆర్ ద్వారా ఫోన్ ట్రేస్ చేసి, స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై సుధాకర్ సెల్ ఫోను అందజేశారు. ఈ సందర్భంగా సెల్ ఫోన్ ను వెతికి అందజేసిన పోలీసులకు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

డేటా ఎంట్రీలో తప్పులుండొద్దు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డిడెస్క్

డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా క్వాలిటీ డేటా ఎంట్రీ చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రాజంపేట్ మండల కేంద్రంలో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా సేకరించిన అభయ హస్తం దరఖాస్తు ఫారాల డేటా ఎంట్రీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రజల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను సేకరించిందని తెలిపారు. దరఖాస్తులను పూర్తిస్థాయిలో సమగ్రంగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగు తుందని చెప్పారు. ఆపరేటర్లకు కేటాయించిన దరఖాస్తు ఫారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు ఫారాలు లబ్ధిదారులు నింపిన వివరాలు సమగ్రంగా ఆన్‌లైన్‌లో నమోదు చేపట్టాలని సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా క్వాలిటీ డేటా ఎంట్రీ జరిగేలా ఎంపీడీవో, తహసీల్దార్లు పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు.



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

- బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజ్

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థుల బోధనా ఫీజు బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా బోధనా ఫీజులు మంజూరు కాలేదని, గతేడాదికే రూ.3250కోట్ల బకాయిలు ఉన్నాయని అన్నారు. రెండేళ్లుగా సంక్షేమ విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ఇప్పటికే కోర్సులు పూర్తి చేసిన, చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, బోధనా ఫీజులు కలిపి 2022-23 విద్యా సంవత్సరం నాటికే సుమారు రూ.3250 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఫీజుల విడుదలలో ఆలస్యం సంక్షేమ శాఖలు విడుదల చేసిన బిల్లులు ట్రెజరీల్లో పెండింగులో ఉండడంతో విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం అప్పులు చేసి కళాశాలల్లో ఫీజులు చెల్లించి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాల్సి వస్తుందన్నారు.



మాట్లాడుతున్న నీల నాగరాజ్

2023-24 సంవత్సరానికి చెల్లించాల్సిన రూ.3250కోట్లలో రూ.1250 కోట్లకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు ట్రెజరీకి పంపి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క రూపాయి విడుదల కాలేదన్నారు. గత బకాయిలు ఈ విద్యా సంవత్సరం ఫీజులు కలుపుకొని మొత్తం సుమారు రూ.5650 కోట్లకు చేరుకోనున్నాయి. ఈ బకాయిలు

బడుగు, బలహీన వర్గాల విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు బకాయిలు విడుదల చేయాలని అన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.సంతోష్, రాజేందర్, ప్రభాకర్, నవీన్, చారి, శ్రీధర్, కుమార్, దయాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుకోని ప్రమాదాలకు అంతపెద్ద శిక్షా..?

- వెహికిల్ చట్ట సవరణలో సెక్షన్ 304/ఏ ను రద్దు చేయాలి
- నేటి నుంచి సమ్మె : లారీ డ్రైవర్ అండ్ క్లీనర్ అసోసియేషన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్‌కు పెద్దఎత్తున శిక్షలు విధించడం తగదని, వెహికిల్ చట్ట సవరణలోని సెక్షన్ 304/ఏను రద్దు చేయాలని లారీ డ్రైవర్ అండ్ క్లీనర్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. నేటి (బుధవారం) నుంచి లారీలను బంద్ పెట్టి శాంతియుతంగా నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ మేరకు నగరం లోని 3 టౌన్ లో ఎస్ ఐ ఎల్. ప్రవీణ్ కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 డిసెంబర్ 25 న కేంద్ర ప్రభుత్వం మోటార్ వెహికిల్ చట్ట సవరణ చేసి సెక్షన్ 304/ఏ ను తీసుకొచ్చిందని, దీని వలన ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగితే డ్రైవరుకు 10 సంవత్సరాల నాన్ బెయిలబుల్ జేల్ శిక్ష, 7 లక్షల జరిమాన విధించనున్నట్టు తెలిపారు. తాము వాహనం నడుపుతున్నాపుడు ప్రమాదం జరగకూదడు అనే కోరుకుంటామని, అయినా అనుకోకుండా ప్రమాద వశాత్తు జరిగితే ఇంత పెద్ద శిక్ష వలన మా జీవితాలు , కుటుంబాలను అంధకారంలోకి నెట్టుతున్నారని అన్నారు. దీంతో తాము తమ వృత్తులను వదలి పెట్టే పరిస్థితి ఏర్పడుతుందని, కావున ఆ చట్ట సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రద్దు చేసే వరకు సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు.



ఎస్ఐకి సమ్మె నోటీసు అందజేస్తున్న డ్రైవర్లు

ఉత్కంఠగా సాగుతున్న కబడ్డీ పోటీలు

- ఫైనల్‌కు వెళ్లేందుకు పోటీపడుతున్న క్రీడాకారులు



కబడ్డీలో పోటీ పడుతున్న క్రీడాకారులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న అండర్ 17 బాలుర కబడ్డి జాతీయ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. ఫైనల్ కు చేరాలని లక్ష్యంతో క్రీడాకారులు ఒకరితో ఒకరు తీవ్రంగా పోటీ పడుతూ కబడ్డీలో కొనసాగుతున్నారు. మూడో రోజు కొనసాగిన కబడ్డీ పోటీలో ఢిల్లీ గుజరాత్ కు మధ్య జరిగిన పోటీల్లో 31- 33 స్కోర్ రాగా కేవలం రెండు పాయింట్లు తేడాతో ఢిల్లీ విజయం సాధించింది. హిమాచల్ ప్రదేశ్ కేంద్ర విద్యాలయ మధ్య జరిగిన మ్యాచ్లో 39- 36 స్కోర్ తో మూడు పాయింట్ల తేడాతో హిమాచల్ ప్రదేశ్ విజయం సాధించింది. మధ్యప్రదేశ్ విద్యా భారతి మధ్య జరిగిన పోర్ట్ మ్యాచ్లో 40- 31 స్కోర్ తో 9 పాయింట్ల తేడాతో విద్యా భారతి టీం విజయం సాధించింది. హర్యానా , తమిళనాడు తో ఇంత పోరాడిన 62- 22 స్కోర్ తో 40 పాయింట్లు తేడాతో హర్యానా ఎదుటి జట్టైనా తమిళనాడు ను మట్టి కురిపించింది. పంజాబ్ మహారాష్ట్ర మధ్య జరిగిన మ్యాచ్లో 35- 24 స్కోర్ తో 11 పాయింట్ల తేడాతో మహారాష్ట్ర విజయం సాధించింది. తెలంగాణ, చతిస్గఢ్ మధ్య జరిగిన పోరులో 27- 34 స్కోర్ తో 13 పాయింట్లు తేడాతో ఛత్తీస్గఢ్ విజయం సాధించింది. కర్ణాటక, ఒడిశా పోటీ పడగా 49- 28 స్కోర్ తో 21 పాయింట్ల తేడాతో కర్ణాటక విజయం సాధించిందనీ ఎస్ జి ఎఫ్ నిర్వహికులు పేర్కొన్నారు.



కబడ్డీ.. కబడ్డీ..

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో ఒకే రోజు నలుగురు మందుబాబులకు జైలు శిక్ష పడింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ కోర్టు న్యాయమూర్తి సయ్యద్ ఖధీర్ మంగళవారం తీర్పునిచ్చారు. ధర్పల్లికి చెందిన ఇద్దరికి ఎనిమిది రోజులు, నిజామాబాద్‌కు చెందిన మరో ఇద్దరికి మూడ్రోజుల చొప్పున జైలు శిక్ష పడింది. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారికి తాజా తీర్పు కఠిన హెచ్చరికను జారీ చేసినట్టయింది. కావున మందుబాబులు, మద్యం సేవించేవారు మద్యం తాగి వాహనాలు నడపకూడదని సంబంధిత పోలీస్ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

మంధర్నలో రాములోరి అక్షింతల ఊరేగింపు

నవతెలంగాణ-బోధన్



అక్షింతల ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

సాలూర మండలంలోని మందర్న గ్రామంలో మంగళవారం గ్రామస్తులు అయోధ్య రామాలయానికి చెందిన రాములోరి అక్షింతలను భక్తిశ్రద్ధలతో ఘనంగా ఊరేగించారు. ఈ అక్షింతల ఊరేగింపు హున్స గ్రామం నుంచి ప్రారంభమై మందర్న గ్రామంలోని హనుమాన్ మందిరం మీదుగా కాశీవిశ్వనాథ ఆలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులతో స్వాగతం పలికారు. యువకులు భక్తి పాటలకు నత్యాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రావుబా గంగాధర్, హున్సా సొసైటీ అధ్యక్షులు మందన్న రవి, రమేష్, మోహన్ దేశాయ్, శివరాజ్, సుధాకర్ పటేల్, ముప్పడి లక్ష్మణ్, సంజీవ్ కుమార్, నాగనాథ్ పటేల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలి సభ్యులు

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ శ్రీ రామాలయంలో కౌన్సిలర్ తూము శరత్‌రెడ్డి పద్మశాలి సంఘం క్యాలెండర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని కోరారు. అనంతరం వారికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాము, విష్ణువర్ధన్, సంఘం సభ్యులు దాసు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధి చేసే దిశగా ముందుకెళ్లాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న అంబిక లక్ష్మీనారాయణ

అర్బన్‌లో పార్టీ అభివృద్ధి చేసే దిశగా ముందుకు వెళ్లాలని టీడీపీ అర్బన్ కన్వీనర్ అంబిక సత్యనారాయణ తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్బన్‌లో పార్టీ అభివృద్ధి చేసే దిశగా ముందుకు వెళ్లాలని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజల పక్షాన ఎల్లవేళలా ఉంటుందని వివరించారు. త్వరలో పూర్తిస్థాయి అనుబంధ సంఘం కమిటీలు వేస్తామని అన్నారు. కార్యక్రమంలో కో కన్వీనర్ బండారి కల్లెడ గంగాధర్, కోయేడి నర్సింలు, పార్టీ సీనియర్ నాయకులు ఎండీ రాఫిక్‌ఖాన్, అనుబంధ కమిటీ కన్వీనర్‌లు లవంగ రాజు, గంగోనే రాజేశ్వర్, లక్ష్మి యాదవ్, నవాటే నర్సయ్య, రమేష్‌గౌడ్, వెంకటేష్, సర్పారాజ్, గంగాసాగర్, శ్రావణ్, చెరుకు గంగాధర్, జాఫర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదుపై ప్రత్యేక సమావేశం



మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండల పరిషత్ కార్యాలయంలో చేపడుతున్న ఆన్లైన్ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆన్లైన్ నమోదు కార్యక్రమాలను వేగవంతం చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. 17 గ్రామ పంచాయతీల పరిధిలో వచ్చిన వినతిపత్రాలను నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈనెల 17లోపు ఎట్టి పరిస్థితుల్లోనూ నమోదు కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించవద్దని ఆయన అన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శులు రాజేందర్‌రావ్, రాఘవేందర్‌గౌడ్, 17 గ్రామ పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కార్మికుల సంఖ్యను పెంచాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రి (జీజీహెచ్) 1000 బెడ్లకు పెంచి పేషంట్ల ఇక్కట్లు తీర్చడంతోపాటు కార్మికుల సంఖ్యలను పెంచాలని తెలంగాణ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏటీయూసీ) ఆధ్వర్యంలో సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, సంవత్సరానికి 23 జాతీయ పండుగ, ఆర్జిత సెలవులు అమలు చేయాలని నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పేషంట్, ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరుగుతున్నందున 1000 పడకలకు పెంచాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికుల సంఖ్యను పెంచి ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపై పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండి హైమది, కోశాధికారి భాగ్యలక్ష్మి నాయకులు నరసయ్య, వెంకటేష్, లలిత, ఎ.స్వరూప, భారతి కార్మికులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థలం అప్పగింత




స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా గత సంవత్సరం అక్టోబర్ నెల 6న అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించారు. అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి స్థలం లేనందున తాత్కాలికంగా ఓ భవనంలో ప్రస్తుతం కొనసాగుతోంది. అగ్నిమాపక భవనం నిర్మాణం కోసం అధికారులు ఇటీవల స్థలాన్ని కేటాయించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీధర్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో గల తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపం వద్ద సర్వేనెంబర్ 1333 విస్తీర్ణం ఏ.0.20 గుంటల భూమిని "అగ్నిమాపక కేంద్రం"ను నిర్మించుటకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం అగ్నిమాపక శాఖ అధికారులకు స్థలాన్ని స్వాధీనపరిచామని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఇంచార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జె.మధుసూదన్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ బి.శేఖర్, కానిస్టేబుల్ ఎస్.నరేష్, ఆర్ఐ.రాఘవేందర్, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

సీఏ ఫైనల్ ఎగ్జామ్‌లో దూపల్లి వాసి ఉత్తీర్ణత

నవతెలంగాణ-రెంజల్



సాయిప్రకాష్‌రెడ్డి

మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన శేషుగారి సాయిప్రకాష్‌రెడ్డి సీఏ పరీక్షలు రాసి మొదటిసారిగా ఉత్తీర్ణత సాధించారు. బీఆర్ఎస్ పార్టీ రెంజల్ మండలాధ్యక్షులు శేషుగారి భూమారెడ్డి, తల్లి లావణ్య కుమారుడు సాయిప్రకాష్‌రెడ్డి చిన్నతనం నుంచి చదువులో ప్రతిభను కనబరిచారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 10 జీపీఏ సాధించిన 17 మందిలో ఆయన ఒకరు. ఉమ్మడి ఏపీలో 98 మార్కులు సాధించి రాష్ట్రంలో నాలుగవ ర్యాంకును సాధించారు. మింట్స్ జూనియర్ కళాశాలలో చదువుతూ సిఏ మొదటిసారిగా ఉత్తీర్ణత సాధించారు. మొదటిసారిగా సిఏ ఎగ్జామ్స్‌లో ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మిల్లర్ల అలసత్వాన్ని ఉపేక్షించం

- నెలాఖరులోపు సీఎంఆర్ కేటాయింపులను పూర్తి చేయాల్సిందే
- ఉల్లంఘనలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు
- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- రైస్ మిల్లర్లకు తేల్చి చెప్పిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రైతుల నుండి ప్రభుత్వపరంగా కొనుగోలు చేసి సమకూర్చిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరుపుతూ ఈ నెలాఖరులోగా నిర్దేశిత కోటాకు అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలను భారత ఆహార సంస్థకు చేరవేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు రైస్ మిల్లర్లకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి రైస్‌మిల్లులో పూర్తి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావు కల్పిస్తూ, నిబంధనలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ కరాఖండీగా తేల్చిచెప్పారు. సీఎంఆర్ లక్ష్య సాధనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారులు, ఎఫ్‌సీఐ ఏరియా మేనేజర్ తదితరులతో కలిసి రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో సీఎంఆర్ కేటాయింపులపై కూలంకషంగా చర్చించారు. నిర్ణీత లక్ష్యం మేరకు మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను అందించకపోవడం పట్ల కలెక్టర్ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున, ఇకపై మిల్లర్ల అలసత్వాన్ని తాము ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని రైస్ మిల్లులలో ప్రతి రోజు కనీసం 6 వేల మెట్రిక్ టన్నుల మేర కస్టమ్ మిల్లింగ్ జరిపే సామర్థ్యం ఉన్నప్పటికీ, సగటున కేవలం 2 వేల మెట్రిక్ టన్నుల వరకే మిల్లింగ్ జరుగుతోందని అసంతృప్తి వెలిబుచ్చారు. దాదాపు 35 వరకు మిల్లులు ఇంతవరకు అసలు సీ.ఎం.ఆర్ కేటాయింపులనే ప్రారంభించలేదని ఆక్షేపిస్తూ, నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టమైన హెచ్చరికలు చేశారు. తాము ఎలాంటి సాకులు వినదల్చుకోలేదని, అవసరమైతే ధాన్యాన్ని కొనుగోలు చేసి అయినా నిర్ణీత గడువులోపు లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లకు తేల్చి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా గల అన్ని రైస్ మిల్లులలో తప్పనిసరిగా పూర్తిస్థాయి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ రైస్‌మిల్లింగ్ జరుపుతూ, ఈ నెలాఖరులోపు ఎఫ్‌సీఐకి నిల్వలు చేరవేయాలని గడువు విధించారు. అవసరమైతే ప్రైవేట్ ధాన్యం మిల్లింగ్‌కు విరామం ఇచ్చి, సీ.ఎం.ఆర్ లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, సాధ్యమైనంత వరకు ఎక్కువ మొత్తంలో బాయిల్డ్ రైస్ నిల్వలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు నెలకొని ఉంటే జిల్లా యంత్రాంగం తరపున తప్పనిసరిగా వాటిని పరిష్కరిస్తామని అన్నారు. మిల్లర్లు పంపించే సీఎంఆర్ నిల్వలను వెంటదివెంట దిగుమతి చేసుకునేలా గోడౌన్‌ల వద్ద కూలీల సంఖ్య పెంచాలని, మిల్లర్లకు కోరిన వెంటనే గోడౌన్‌లలో బియ్యం దిగుమతి కోసం ఎక్కడ స్థలం అందుబాటులో ఉంటే అక్కడికి మిల్లర్లను అనుమతించాలని ఎఫ్.సీ.ఐ అధికారులకు కలెక్టర్ సూచించారు. కాగా, ఇప్పటికే 2022-2023 ఖరీఫ్, రబీ సీఎంఆర్ లక్ష్యసాధనకు చేరువలో ఉన్న రైస్‌మిల్లులలో 2023-2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కూడా కస్టమ్ మిల్లింగ్ నిర్వహించేలా అనుమతించాలని పలువురు రైస్‌మిల్లర్లు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు. ఈ సమావేశంలో డీఎస్ఓ చంద్రప్రకాష్, సివిల్ సప్లయిస్ డీ.ఎం జగదీశ్, ఎఫ్.సీ.ఐ ఏరియా మేనేజర్ వర్మ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వి.మోహన్‌రెడ్డి, కాపర్తి శ్రవణ్, రైస్‌మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి

- కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి అశ్వని శ్రీవాస్తవ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న అశ్వని శ్రీవాస్తవ

శతశాతం లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని కేంద్ర ఆహార అండ్ ప్రజాపంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అశ్వని శ్రీవాస్తవ అన్నారు. మంగళవారం ఇందల్వాయి మండలం అన్సాన్‌పల్లి గ్రామంలో కొనసాగిన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలలో పెద్దసంఖ్యలో ప్రజలు భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమానికి శ్రీ అశ్వని శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా విచ్చేయగా, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మనాయక్, ఎల్‌డిఎం శ్రీనివాసరావ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆహార అండ్ ప్రజాపంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీఅశ్వని శ్రీవాస్తవ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వందశాతం లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. అర్హులై సంక్షేమ పథకాలు లబ్ధిపొందని వారు ఉండకూడదనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర పథకాల గురించి అవగాహన పెంపొందించుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పట్టణ, గ్రామగ్రామాన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. పేద ప్రజలకు మౌలిక సదుపాయాలైన పారిశుధ్యం, ఆర్థిక సహాయం, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు, పక్కా ఇండ్లు, ఆహార భద్రత, పౌష్టికాహారం, వైద్యం, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, అర్హులైన లబ్ధిదారులు వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలనే అకుంఠిత దీక్షతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వారిచే సభలో వారి అనుభవాలను, అనుభూతులను స్వయంగా వివరింపజేశారు. ప్రస్తుతం సంకల్ప యాత్ర ద్వారా మీ ముంగిటకు వచ్చిన అధికారులకు నేరుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇప్పటికే కేంద్ర పథకాల ద్వారా ప్రయోజనం పొందిన పలువురు లబ్ధిదారులతో మాట్లాడించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలు, గోడప్రతులు, క్యాలెండర్లను ఆవిష్కరించి, ప్రజలకు పంపిణీ చేశారు. ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. సంకల్పయాత్ర కార్యక్రమాలలో యంపీడీఓ శ్రీరాములు, సర్పంచ్, డియల్‌పిఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కాదు.. మురికి నీరు

- అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు



నీటిలో నాచు, పురుగులు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలో గత కొంత కాలంగా మిషన్ భగీరథ నీటికి బదులు మురికి నీరు వస్తోంది. దీనికి నాచుతో పాటు పురుగులు తోడై నీరు రావడంతో ప్రజలు అవే తాగాల్సిన దుస్థితి నెలకొంది. తద్వారా అనారోగ్యాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా చాకలి, కసబ్ గల్లీలతో పాటు అంగడి బజార్‌లో మిషన్ భగీరథ బదులుగా మురికి నీరు రావడం పట్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యం కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలి

- ఎంపీడీవో శంకర్



నవతెలంగాణ-రెంజల్

ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలని ఎంపీడీవో శంకర్ సూచించారు. మంగళవారం మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో గత నెల 28 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో శంకర్ గ్రామ కార్యదర్శులకు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఆదేశించారు. ఈనెల 15న సంక్రాంతి పండుగ ఉన్నందున 14 వరకే దరఖాస్తులన్నింటినీ పూర్తిచేసేలా చూడాలని ఆయన అన్నారు. రాత్రి 8 గంటల వరకు ఆన్లైన్ కార్యక్రమాలను కొనసాగించాలని ఆయన కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి, కార్యదర్శులు రాజు, సాయిబాబా, రజిత, అమ్రిన్, రోజా, కంప్యూటర్ ఆపరేటర్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం ఉదయం తిరుమల తిరుపతి దేవస్థానాన్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించడంతో మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు.

సంక్రాంతికి వెళ్తే పోలీస్ శాఖ నిబంధనలు పాటించాలి

- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సంక్రాంతి పండగకు వెళ్లే వారు నిజామాబాద్ పోలీస్ శాఖ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విలువైన వస్తువులను బంగారం, డబ్బులు లాకర్‌లో భద్రపరచాలని సూచించారు. సెంట్రల్ లాకింగ్ వాడాలని, గ్రామాలలోని ప్రజలు సంబంధిత పోలీస్‌స్టేషన్ వారికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సి.సి.టి.విలు సరైన విధంగా పనిచేసేటట్లు, మంచి కండిషన్‌లో ఉండేవిధంగా చూచుకోవాలని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులు వస్తే వారి సమాచారం పోలీస్ వారికి తెలియజేయాలని సూచించారు. శివారు ప్రాంత కాలనీలలో తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతకటం, రాత్రి వేళ చోరీలకు పాల్పడతారని, వారిపై నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇరుగు పొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పాలని పేర్కొన్నారు. పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మంచిదని, ఇంట్లో కుటుంబ సభ్యులు వెళ్లగా ఉన్న మహిళలు, వృద్ధులు అపరిచితులు సమాచారం పేరుతో వస్తే నమ్మవద్దని సూచించారు. ఊరు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులు ఉంచకపోవడమే మంచిది (లేదా) బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవడం మంచిదని, కాలనీల వారిగా గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. తాళం వేసి ఊరు వెళ్లే ముందు మీ సమీప పోలీస్‌స్టేషన్లో సమాచారం అందించాలని సూచించారు. పోలీస్‌శాఖ వారికి దొంగతనాలపై అనుమానితుల సమాచారం అందించి దొంగతనాల నివారణకు సహకరించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వదలుచుకునేవారు మీ సమీప పోలీస్ స్టేషన్లను సంప్రదించాలని, లేదా డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలని సీపీ కల్మేశ్వర్ సింగేవార్ తెలియజేశారు.

ముగ్గుల పోటీలు

- విజేతలకు బహుమతులు అందజేత



ముగ్గులను పరిశీలిస్తున్న ట్రస్ట్ చైర్‌పర్సన్ అయేషా

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని రెంజల్, కళ్యాపూర్ గ్రామాలలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలను మంగళవారం నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు ట్రస్ట్ చైర్‌పర్సన్ అయేషా ఫాతిమా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు ఎమ్మెస్ రమేష్ కుమార్, కళ్యాపూర్ సర్పంచ్ కాశం నిరంజన్ సాయిలు, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు శేషుగారి భూమారెడ్డి, సొసైటీ డైరెక్టర్ అగ్గు నారాయణ, అనిల్, సాయగౌడ్, పాలకవర్గ సభ్యుడు కుమార్, గ్రామ కార్యదర్శి రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బిల్కిస్ భానో కేసులో సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

- ఐద్వా

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి సుజాత

బిల్కిస్ భానో కేసు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని స్వాగతిస్తున్నామని నిజామాబాద్ ఐద్వా సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా నాందేవ్‌వాడలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. బిల్కిస్ భానో కేసు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. బేటి బచావో బేటి పడావో అని చెప్పిన మన దేశ ప్రధాని నరేంద్రమోడీ నిందితులకు బెయిల్ ఇచ్చి సన్మానాలు చేసి గణనీయంగా ఆహ్వానించిందని తెలిపారు. కానీ సుప్రీంకోర్టు నిందితులతో పాటు ప్రధాని మోడీకి కూడా చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చిందని తెలిపారు. ఇలాంటి దాడులకు హత్యలకు, హత్యాచారాలకు పాల్పడుతున్న నిందితులకు మళ్లీ ఇతర మహిళలపై కానీ ఇతర కుటుంబాలపై కానీ దాడులు చేయాలంటే వణుకు పుట్టే విధంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడం శుభపరిణామమని వివరించారు. ఇందులో ప్రధానంగా ఐద్వా ఆల్ ఇండియా నాయకురాలు అయిన సుభాషిని అలీ, అలాగే నేతాజీ సుభాష్ చంద్ర బోస్ నిర్మించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ మహిళా విభాగ చీఫ్ గెస్ట్‌గా జాతీయ ఉద్యమ నాయకురాలిగా పనిచేసిన కెప్టెన్ లక్ష్మీ సేహెగల్ కుమార్తె కామ్రేడ్ సుభాషిని అలీ ముఖ్య పాత్ర వహించి పిటిషన్ వేసి సంవత్సరన్నర కాలం పోరాటం చేశారని తెలిపారు. మహిళలపై ప్రత్యేక దృష్టి పెట్టి భరోసానిచ్చిన సుప్రీంకోర్టుకు, అలాగే సుభాషనీ అలీకి, ఐద్వా నిజామాబాద్ జిల్లా కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఎ.అనిత, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నెంబర్‌ప్లేట్ లేకుంటే సీజ్ చేస్తాం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని బుధవారం ఎస్ఐ కొనారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రహదారి 16 అంజని గేటు వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ కొనారెడ్డి మాట్లాడుతూ వాహనదారులు ద్విచక్ర వాహనాలకు వెనుక ముందర భాగంలో తప్పక నంబర్ ప్లేట్ ఉంచుకోవాలని లేని యెడల వాహనాలు సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించి వాహనదారునిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. వాహనదారులు వాహనాలపై ప్రయాణం చేసే సమయంలో వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకొని రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. పాత చాలాలన్‌లను వెంటనే చెల్లించుకోవాలని సూచించారు.


వాహనంను తనిఖీ చేస్తున్న పోలీసులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కాటేపల్లి గ్రామంలో యువకులు సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ఎంపిడిఓ ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఎంపిడిఓ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ నెల 16వ తేదీ వరకు టోర్నమెంట్ కొనసాగుతుందని పోటీలో గెలచిన జట్టుకు మొదటి, రెండవ బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజా ప్రతినిధులు యువకులు క్రీడా కారుల పాల్గొన్నారు.


క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ

జర్నలిస్ట్ లాలయ్య మృతి

నవతెలంగాణ-బిచ్కుంద


గోనెలాలయ్య (ఫైల్)

బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ గోనెలాలయ్య మంగళ వారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. గోనెలాలయ్య గత 18 సంవత్సరాలుగా వివిధ ప్రముఖ పత్రికల్లో పనిచేశారు. గతంలో ప్రజాశక్తి దినపత్రికలో కొన్ని సంవత్సరాల పాటు పనిచేశారు. ఆయన మృతి పట్ల బిచ్కుందం మండలంలోని జర్నలిస్టులతో పాటు ప్రజా ప్రతినిధులు, వ్యాపారస్తులు, జుక్కల్ నియోజకవర్గ జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. లాలయ్య మృతితో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శోకసముద్రంలో మునిగిపోయారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరేంధర్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని మేంగారం గ్రామంలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు. విద్యార్థులకు సేవభావం కచ్చితంగా అవసరమన్నారు. ప్రతి విద్యార్థిని విద్యార్థులు సేవాభావంతో ముందుకు పోవాలని వారం రోజులపాటు జరిగే శీతాకాలం శిబిరంలో ఆసక్తితో పాల్గొనాలని సూచించారు. సేవ చేసిన వారికి ప్రత్యేక గుర్తింపునిస్తామని తెలిపారు. విద్యార్థినిలకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) గురించి వివరించారు. గ్రామంలో చేయబోయే కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ సింగిల్ విండో వైస్ చైర్మన్ మకాం రాములు, అధ్యాపకులు విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా సత్యనారాయణ

నవతెలంగాణ-జుక్కల్



జుక్కల్ మండల డిప్యూటి తహసీల్దార్‌గా సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండ లంలోని పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా డిటీ మాట్లాడుతూ అంతకు ముందు ఎన్ఫోర్స్ మెంట్ డిటీగా విధులు నిర్వహించానని, ప్రస్తుతం జుక్కల్ మండలానికి డిప్యూటి తహసీల్దార్‌గా డిప్యూటేషన్ లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పదవి బాధ్యతలు తీసుకున్నట్టు తెలిపారు. పేదలకు సేవలందించి మంచి గుర్తింపు వచ్చే విధంగా విధులు నిర్వహిస్తానని డీటీ తెలిపారు.

పదివేల విరాళం



నవతెలంగాణ-గాంధారి

గండివేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గండివేట్‌లో చదివిన సీతాయిపల్లి గ్రామానికి చెందిన రోడ్డొల్ల గంగాధర్ అనే పూర్వ విద్యార్థి పాఠశాల శుభ్రత కొరకు అవసరమైన పారిశుధ్య కార్మికునిని రెండు నెలల వేతనం పదివేల రూపాయలను సీతాయిపల్లి గ్రామంలో పాఠశాల కమిటీ చైర్మన్ బి భాస్కర్, సీతాయిపల్లి గ్రామ పెద్దలు, గ్రామస్తుల సమక్షంలో మంగళవారం అందజేశారు. స్కూల్ హెడ్‌మాస్టర్ పి శ్రీనివాస్‌కు అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా రొడ్డొల్ల గంగాధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో పూర్తి చేయాలి

- తప్పుగా నమోదు చేయొద్దు
- బాన్సువాడ ఆర్డీవో భుజంగ్‌రావు

నవతెలంగాణ-పిట్లం/మద్నూర్

ప్రజాపాలన దరఖాస్తులను సత్వరమే డాటా మధ్య ఎంట్రీ ప్రక్రియ పూర్తిచేయాలని బాన్సువాడ రెవిన్యూ డివిజనల్ అధికారి భుజంగరావు అన్నారు. మంగళవారం మండల తహసిల్ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 28వ తారీకు నుండి జనవరి 6 వరకు నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో మండలంలోని అయా గ్రామాల వారిగా ప్రజలు పెద్ద ఎత్తున 13 వేల 200 దరఖాస్తులు చేసుకోగా వాటిని జనవరి 13వ తారీకు గడువు కావడంతో ఆలోపు మండల అధికారులు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. డాటా ఎంట్రీ పూర్తి చేసినట్లయితే లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు చేరువయ్యేందుకు అవకాశాలు ఉంటాయని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్ రావు , ఎంపీడీవో వెంకటేశ్వర్లు , ఏపీవో బ్రహ్మం డిప్యూటీ తాసిల్దార్ నరేష్ , రెవిన్యూ ఇన్స్పెక్టర్ శీతల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రెవెన్యూ డివిజనల్ అధికారి


మద్నూర్‌లో...

తప్పులులేకుండా నమోదు చేయాలి: తహసీల్దార్

మద్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆరు గ్యారెంటీలు అమలుపరిచేందుకు గత నెల 28 నుండి జనవరి ఆరవ తేదీ వరకు గ్రామ పంచాయతీల వారీగా ప్రజల నుండి స్వీకరించిన ప్రజా పాలన దరఖాస్తులను మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను ప్రారంభించారు. తహసిల్దార్ ఎండి ముజీబ్ పర్యవేక్షణలో జి పి జోనల్ ప్రెసిడెంట్ కేఆర్ భాస్కర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన ప్రజా పాలన దరఖాస్తులను కంప్యూటర్ ఆపరేటర్లు సక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల అనుసారంగా తాసిల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తులు పంచాయతీల వారీగా నమోదు చేస్తున్నట్టు తెలిపారు. జీపి జోనల్ ప్రెసిడెంట్ కె.ఆర్ భాస్కర్ మాట్లాడుతూ పంచాయతీల వారీగా ప్రజా పాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పూర్తి చేయనున్నట్టు తెలిపారు.

శిథిలావస్థకు ప్రజాపరిషత్ భవనం

- 1990లో నిర్మించగా.. పెచ్చులూడుతున్న వైనం
- వానకాలం బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న అధికారులు
- నూతన భవనం మంజూరయ్యేనా...?

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. 1990 సంవత్సరంలో ప్రారంభమైన మండల ప్రజా పరిషత్ కార్యాలయం కేవలం 34 సంవత్సరాల లోపల శిథిలావస్థకు చేరింది. వర్షాకాలం వస్తే చాలు కార్యాలయం ఊరుస్తుంది. పైకప్పు తడిసి పెచ్చులూడి కింద పడుతుండటంతో అధికారులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో మండల సమావేశాలు మండల స్థాయి అధికారుల సమావేశాలు మండల పరిషత్ కార్యాలయం పక్కన ఉన్న స్త్రీ శక్తి భవన్లో నిర్వహిస్తున్నారు.

ఇప్పటివరకు ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకులు మండల పరిషత్ కార్యాలయం నూతన భవనం మంజూరు చేయలేదు. స్థానిక మండల స్థాయి నాయకులు నియోజకవర్గ స్థాయి నాయకులకు వినతి పత్రాలు సమర్పించిన లాభం లేకుండా పోయింది. నాగిరెడ్డిపేట మండలంలో 27 గ్రామపంచాయతీలు 27 గ్రామపంచాయతీలకు సంబంధించిన సర్పంచులు ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు సమావేశాలు శ్రీ శక్తి భవన్లోనే నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు మండల ప్రజా పరిషత్ నూతన భవనం మంజూరు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో మండల ప్రజాపరిషత్ భవనం


పెచ్చులూడుతున్న పై కప్పు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

గురుకుల డిగ్రీ కాలేజీలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-సదాశివనగర్

మర్కల్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో సంక్రాంతి ముగ్గుల పోటీలను కళాశాల కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ విద్యార్థుల వికాసానికి దోహదపడుతుందని, కళాశాలలో ప్రతి పండుగను విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవడం వారి అభ్యున్నతికి తార్కాణమని కళాశాల ప్రిన్సిపాల్ వి. రాధిక కొనియాడారు. కళాశాలలోని ఒక్కో గ్రూపు నుండి ఒక్కో ముగ్గును అందమైన రంగవల్లులుగా తీర్చిదిద్దడంలో విద్యార్థులు చూపిన ప్రతిభ, సృజనాత్మకత అపూర్వమనీ, ఈ పోటీలలో ప్రథమ బహుమతి ఎంఎస్ డిఎస్ తృతీయ సంవత్సరం విద్యార్థులు, ద్వితీయ బహుమతిని ఎంపీసీ తృతీయ సంవత్సరం విద్యార్థులు, తృతీయ బహుమతి బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులు గెలుపొందారని, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి. రేణుక, అకాడమిక్ కో-ఆర్డినేటర్ కే. వనజ అధ్యాపక బృందము, విద్యార్థులు పాల్గొని పండుగ వాతావరణాన్ని తలపించారని కళాశాల కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ ఆర్. ఉదయిని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడికి గాయాలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు స్టాలిన్ కు సోమవారం రాత్రి బైకు అదుపుతప్పి పడిపోవ డంతో తలకు బలమైన గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు. గ్రామా నికి చెందిన కాంగ్రెస్ నాయ కుడు స్టాలిన్ సోమవారం రాత్రి తొమ్మిది గంటల 30 నిమిషాల సమయంలో కామారెడ్డి నుండి తన స్వగ్రామం లింగంపేట్ కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎల్లారం గేట్ సమీపంలోని మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొనడంతో కాలు విరిగింది. 108లో ఆస్పత్రికి తరలించారు.


గాయాలతో కాంగ్రెస్ నాయకుడు

పీహెచ్‌సీ, హాస్టల్ పరిశీలన

నవతెలంగాణ-రామారెడ్డి


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఎంపీపీ

మండల కేంద్రంలోని షెడ్యూల్ కులాల వసతి గృహాన్ని, కస్తూర్బా గురుకుల హాస్టల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం స్థానిక ఎంపీపీ నా రెడ్డి దశరథ్‌రెడ్డి పరిశీలించారు. పిహెచ్సిలో పలు రికార్డులను పరిశీలించారు. మందుల నిలువ, రోగుల వివరాలపై ఆరా తీశారు. హాస్టల్లో విద్యార్థుల సౌకర్యాలపై వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు జైపాల్, పిహెచ్సి వైద్యులు సురేష్, చైతన్యశ్యాంసుందర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన లక్ష్మణ్‌ను మంగళవారం కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజు దాస్. కోఆప్షన్స్ సభ్యుడు షాయద్ పాషా తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్. ఇమామ్. విక్రమ్ తదితరులు ఉన్నారు.

నాగల్‌గావ్ సర్పంచ్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు



వైద్యపరిక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్‌లోని గ్రామ సర్పంచ్ కపిల్ పటేల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించిన మంగళవారం పేదలకు వైద్యపరిక్షలు నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ యాభై రకాల వ్యాదులకు సంబంధించిన వ్యాదులకు ఉచితంగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. నిజామాబాద్‌లోని ఓ ప్రయివేటు హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించినట్టు తెలిపారు.

దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు


దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో అభయహస్తకోసం దరఖాస్తు చేసుకున్న వారి లబ్దిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్టు మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున్ మంగళవారం తెలిపారు. లింగంపేట్ మండలంలోని 41 గ్రామపంచాయతీ పరిధిలో 12 వేల 504 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. మరో వారం రోజులపాటు ఆన్‌లైన నమోదు పూర్తవుతుందని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సుధాకర్, ఎంపీఓ ప్రభాకర చారి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అక్షింతల పంపిణీ


అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని చిన్నగుల్లాలో సర్పంచ్ శోభ ఆధ్వర్యంలో రామ మందిరం ఈ నెల 22న ప్రారంభించనున్నారు. మందిరానికి సంబంధించి ఆహ్వాన పత్రాలు చిన్న గుల్లాకు రావడంతో పాటు వాటితో పాటు అంక్షింతలు గ్రామంలోని ప్రతీ ఇంటికి పంపిణీ చేశారు. గ్రామాల నుండి రామ మందిరం ప్రారంభానికి రావడం కుదరని వారు ఇంట్లోనే రాముని చిత్రపటానికి పూజలు నిర్వహించుకోవచ్చని , అక్కడే అంక్షింతలు వేసి పూజలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ , గ్రామస్తులు , హరిపాట్ భజన మండలి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి పరామర్శ


మంత్రిని పరామర్శింశిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మంగళవారం ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రావు పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా తెలంగాణ రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని పరామర్శించి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీ లాభంలో ప్రధాన పాత్ర పోషించాలని ఆయన అన్నారు. త్వరగా కోలుకొని ప్రజా పాలనలో భాగస్వామ్యం కావాలన్నారు. వైద్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని గుండూర్ గ్రామంలో కల్వర్టు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ నాయకులు స్థానిక సర్పంచ్ దేవిదాస్, ఉపసర్పంచ్ ఉమాటే ప్రకాష్‌తో కలిసి పనుల నిర్మాణాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అస్పత్ వార్ వినోద్ మాట్లాడుతూ గుండూర్ నుండి చిన్నగుల్లాకు మద్యమార్గం నుండి మట్టి రోడు ఎండ్ల క్రితం వేసింది ఉంది. ప్రస్తుతం దారి లేక రోడ్డు శిథిలం కావడంతో గుట్టల ప్రాంతం నుండి వర్షపు నిరు పల్లంకు వచ్చి చేరుతున్న క్రమంలో దారి కోతకు గురి అవుతోంది. వ్యవసాయ దారులకు పంట పోలాలకు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను గుండూర్, చిన్నగుల్లా రైతులు విన్నవించడంతో రూపాయలు రెండున్నర లక్షల వ్యయంతో నిర్మాణం చేపడుతున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దత్తు, వివిధగ్రామాల ఉపసర్పంచులు విండో డైరెక్టర్ పెద్ద గుల్లా విఠల్ పటేల్, వెంకట్ రావ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్న పల్లి, (రామారెడ్డి) లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. ఉదయాన్నే మూలభావి నీటితో ఆలయాన్ని శుభ్రం చేసి, స్వామివారికి సింధూర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేసింది.

ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, సిబ్బంది సురేందర్, పూజారులు శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.


అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
బుధవారం | జనవరి 10, 2024 | www.navatelangana.com

కూలీలకు ఉపాధి నిలయం..
క్లాక్ టవర్ అడ్డా



నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని కెనాల్ బ్రిడ్జి బ్యాంకు పక్కన గల క్లాక్ టవర్ అడ్డా కూలీల ఉపాధికి నిలయంగా మారింది. ప్రతిరోజు ఉదయం సూర్యోదయానికి ముందే రోజువారి పనులకు వెళ్లేవారు ఇక్కడ కనపడతారు. తాజాగా మంగళవారం ఉదయం జానెడు పొట్ట నింపుకునేందుకు పనులకు తీసుకెళ్లే వారు వస్తారేమోనని ఎదురుచూస్తూ నిలబడ్డారు. ఆ చిత్రాన్ని నవతెలంగాణ తన కెమెరాలో బంధించింది.

ఓపెన్ అడ్మిషన్లకు రేపే చివరి అవకాశం

నవతెలంగాణ-బోధన్
చదువును మధ్యలో మానేసిన వారు తిరిగి చదువుకోవాలనే ఉద్దేశంతో ఉన్నవారికి ప్రభుత్వం ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా అవకాశాన్ని కల్పిస్తుందని హెచ్ఎం బాలచంద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ మధ్యలో మానేసిన వారు, ఫెయిల్ అయిన వారు తిరిగి తమ చదువును కొనసాగించడానికి ఓపెన్ స్కూల్ ద్వారా అడ్మిషన్లు పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. దానికోసం జనవరి 9వ నుంచి 11వ తేదీ వరకు పదవ తరగతి ఇంటర్మీడియట్‌లలో అడ్మిషన్లు పొందుటకు చివరి అవకాశమని వివరించారు. ఈ విద్యా సంవత్సరానికి ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు అడ్మిషన్లు పొందడానికి బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసి) లో సంప్రదించాలని సూచించారు.

ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మోర్తాడ్
మండలంలోని సుంకెట్ గ్రామానికి చెందిన విద్యార్థిని ఉన్నత చదువులకు బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి సునీల్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆకుల బాలకిషన్ గత కొంత కాలంగా అనారోగ్యంతో మృతిచెందగా వారి కూతురు ఉన్నత చదువులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకున్న సునీల్ రెడ్డి రూ.25వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. వరంగల్‌లో అగ్రికల్చర్ కోర్స్ చదువుతున్న ఆమె డబ్బులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని విషయం తెలుసుకొని ఆమెకు ఆర్థిక సాయంని అందించినట్లు తెలిపారు. ఆ ఆర్థికసాయాన్ని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాములు, సుధీర్, సంతోష్, మైపాల్, అశోక్ ఆర్థిక సాయాన్ని అందజేశారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్
రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, స్టిక్కర్స్‌ను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఏసీపీ జగదీష్ చందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్లో రోటరీ సేవలు స్ఫూర్తిదాయకమని, వారికి ఎల్లప్పుడూ సహకారాలు పోలీస్ శాఖ తరపున ఉంటాయని అన్నారు. రోటరీ అధ్యక్షులు పట్వారీ గోపికృష్ణ ఏసీపీని సన్మానించి జ్ఞాపిక అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పట్వారి తులసి, ప్రాజెక్ట్ చైర్మన్, స్పాన్సర్ రాస ఆనంద్, పుష్పకరావు, రజనీష్ కిరాడ్, శశిధర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్ క్రికెట్ గ్రౌండ్‌లో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని బషీరాబాద్ గ్రామంలోని బషీరాబాద్ క్రికెట్ మైదానంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ, గ్రామకమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ మైదానాన్ని చీపురులతో ఊడ్చి శుభ్రం చేశారు. మైదానం లోపల పిచ్చి మొక్కల్ని, చెత్తను తొలగించి, ఏపుగా పెరిగి మైదానంలో ఇబ్బందిగా ఉన్న చెట్లను కోత మిషన్‌తో కోయించారు. మైదానం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ బల్బులు పాడైన చోట కొత్త బల్బులను అమర్చి సరి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సక్కరం అశోక్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఆకుల బాజన్న, కార్యదర్శి తోపారపు గంగాధర్, బీసీ అధ్యక్షులు బందెల రాజు, రంజిత్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

బహుజన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీచర్లు

నవతెలంగాణ-వర్ని
మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం బహుజన టీచర్ అసోసియేషన్ మండల యూనియన్ క్యాలెండర్ 2024ను ఉపాధ్యాయులు మురళి మోహన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బహుజనులు ఐక్యత చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బహుజన ప్రధాన కార్యదర్శి స్వామినాయక్, ఉపాధ్యాయులు యాకుబ్‌అలీ, రాములు, ఇందిరా, విక్టోరియా, మాధవీ లత, సునీత, భారతి, అనుజ, శ్రీకాంత్, సాయిబాబు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీని సక్రమంగా చేపట్టాలి

- ప్రత్యేకాధికారి మధుసూదన్

నవతెలంగాణ-వర్ని
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయహస్తం ప్రజా పాలనలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్లో స్పష్టంగా నమోదు చేయాలని పిడి మధుసూదన్ కంప్యూటర్ సిబ్బందికి సూచించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షుప్తంగా పరిశీలనలోకి తీసుకొని నమోదు చేయాలని స్థానిక అధికారులకు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎంపీడీవో బసిరుద్దీన్, ఎంపీఓ చందర్, డాటా ఎంట్రీ సిబ్బంది తదితరులున్నారు.

ప్లాస్టిక్‌ను నియంత్రించాలి

- పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పాటుపడాలి
- డీఈవో దుర్గాప్రసాద్



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

నవతెలంగాణ-సిరికొండ
జీవకోటి మనుగడకు పర్యావరణం ప్రధానమైనదని, ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని.. అందువల్ల ప్లాస్టిక్‌ను నియంత్రించి ప్రకృతి, పర్యావరణాన్ని పరిరక్షించుటకు పాటుపడాలని జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సత్యశోధక్ పాఠశాల నేషనల్ గ్రీన్ కోర్ యూనిట్ ఆధ్వర్యంలో "ప్లాస్టిక్ వాడకాలను నిషేధిద్దాం - పర్యావరణన్ని కాపాడుదాం" అనే నినాదాలతో రూపొందించిన గోడప్రతులను డీఈవో దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచీకరణ పారిశ్రామీకరణ పేరిట జరుగుతున్న విధ్వంసంలో ఊహకందని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని, తద్వారా జీవమనుగడ పురోగతి ప్రశ్నార్థకంగా మారుతున్న నేటి తరుణంలో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని, ప్లాస్టిక్ వాడకం నివారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలను అందించి అభినందించారు. వీరితో పాటు జిల్లాస్థాయి ఇన్స్పైర్ సైన్స్ ప్రాజెక్ట్‌కు ఎంపికైన సత్యశోధక్ విద్యార్థులు కె.దామోదర్, సి.హెచ్. కృతిక, జి.అద్వైత్‌రెడ్డికి తన కార్యాలయంలో ప్రత్యేక జ్ఞాపికలను అందించి సత్కరించారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటూ శాస్త్రీయతతో సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యశోధక్ ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య, ఎన్‌జీసీ గైడ్ ఉపాధ్యాయుడు సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు
ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలి

- మేజర్ గ్రామపంచాయతీలో డే అండ్ నైట్ షిఫ్ట్ ఏర్పాటు చేయాలి
- అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా



సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
హాలిడేస్ కంటే ముందే ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా ఎంపీడీవోను ఆదేశించారు. జక్రాన్‌పల్లి మండలంలో గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు కొనసాగిన ప్రజాపాలనకు సంబంధించిన 14,629 దరఖాస్తులను మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్లైన్లో నమోదు చేపడుతున్నారు. కాగా సోమవారం జక్రాన్‌పల్లి మండలం ప్రజాపాలన అప్లికేషన్ల డాటా ఎంట్రీ రిపోర్ట్ ప్రోగ్రెస్ పెరగనందున అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం మండల కేంద్రంలో మోడల్ స్కూల్లో ప్రజా పాలన దరఖాస్తుల ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హాలిడేస్ కంటే ముందే ప్రజాపాలన దరఖాస్తులు ఆన్లైన్ ఎంట్రీ పూర్తి చేయాలని, మేజర్ గ్రామపంచాయతీలో డే అండ్ నైట్ షిఫ్టులు ఏర్పాటు చేసి ప్రణాళిక ప్రకారం డాటా ఎంట్రీని పూర్తిచేయాలని మండల స్థాయి అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఎంపీడీఓ బ్రహ్మానందం, ఎంపీఓ యూసఫ్ ఖాన్, తహసీల్దార్ ఎం.ఎ.ఖలీమ్, స్పెషల్ ఆఫీసర్ తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి అన్నారు. ఎబివిపి తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని యువజన ఉత్సవాలలో భాగంగా మంగళవారం చివరి రోజు, క్విజ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులందరూ ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాల్లో ముందుండాలని, స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్‌లను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని, దేశసేవలో, దేశానికి అపద వచ్చినప్పుడు యువత ముందు వరుసలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎబివిపి జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నాగరాజు, నాయకులు సాయికుమార్, అమృత్‌చారి, హరిక్రిష్ణ, రుషి, చందు, నరేష్, ప్రమోద్, సింహాద్రి, నరసింహ, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఎనిమిది రోజుల జైలు శిక్ష

- సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పు

నవతెలంగాణ-ధర్పల్లి
డిసెంబర్ 31రాత్రి ధర్పల్లి పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఇద్దరు మందు ప్రియులపై కేసు నమోదు కాగా వారిని పోలీసులు మంగళవారం కోర్టులో హాజరు పరిచారు. కాగా వీరిద్దరినీ నిజామాబాద్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సయ్యద్ ఖదిర్ తీర్పు వెలువడించినట్టు ఎస్ఐ వంశీ క్రిష్ణరెడ్డి తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్
రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్ చేతుల మీదుగా తెలంగాణ జిహెచ్ఎం అసోసియేషన్ క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ పి.లక్ష్మీనరసయ్య, మండల విద్యాధికారి రాజగంగారం, మగ్గిడి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజ, రామ్‌మందిర్, మచ్చర్ల, జక్రాన్‌పల్లి, పెర్కిట్, సుర్బిర్యాల్, మామిడిపల్లి, ప్రధానోపాధ్యాయులు చలం, పండరి, లింగన్న, శ్రీనివాస్, ముజ్బుర్, రెహమాన్, నారాయణ, ఎం.శ్రావ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను
సద్వినియోగం చేసుకోవాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి



మాట్లాడుతున్న జీవీ నరసింహారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్
కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జివి నరసింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చేపడుతున్న వికసిత్ భారత్ సంకల్పయాత్రను మంగళవారం పట్టణంలోని పెర్కిట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ముద్ర, వీధి వ్యాపారులకు ఇచ్చే రుణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు పట్టణ స్థాయి నుంచి గ్రామీణ ప్రాంతం వరకు చేర్చడానికి ఎంపీ ధర్మపురి అరవింద్ పాత్ర అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2047వ సంవత్సరానికి అభివృద్ధి చెందిన దేశంగా చూడాలన్నదే భారత ప్రధాని లక్ష్యమని అందువలననే ఈ వికసిత భారత్ సంకల్పయాత్ర ద్వారా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు చేరవేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి పులి యుగంధర్, దుగ్గి విజయ్, సాయినాథ్‌రెడ్డి, భారత్‌గ్యాస్ మేనేజర్ సుమన్, గంగాధర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెర్కిట్ బ్రాంచ్ మేనేజర్ సంజీవ్, అగ్రికల్చర్ శాఖ ఏవో నరేష్, వెటర్నరీ డాక్టర్ మానస, డాక్టర్ రాజేశ్వర్, ఐసిడిఎస్ అధికారిణి జ్యోతి, అంగన్వాడీ సిబ్బంది, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత



నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని పిప్రి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సుంకం భూషణ్ ఆరుగురు విద్యార్థులకు మంగళవారం నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతినెల విద్యార్థులకు తోచిన సహాయం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

- నవనాథ సిద్ధుల గుట్ట వద్ద

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్ధులగుట్టకు చెందిన ప్రభుత్వ స్థలాన్ని కొందరు చదునుచేసి కబ్జాకు యత్నిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని సిద్ధులగుట్ట వెనుక 63వ జాతీయ రహదారి పక్కన ధోబీఘాట్ వద్ద మత్స్యశాఖకు చెందిన భవనం ఉంది. ఈ భవనం పక్కన రాళ్లు, చెట్లతో ఖాళీ ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలం ఖాళీగా ఉండడంతో అక్రమార్కుల కన్ను పడింది. ఎలాగైనా ఖాళీగా ఉంది కాబట్టి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించాలని పతకం వేశారు. ఈ స్థలానికి సంబంధించి ఎలాంటి పత్రాలు, ఆధారాలు లేకున్నా సోమవారం రాత్రి వేళలో ప్రోక్లెయిన్‌తో రాళ్లను, చెట్లను తొలగించి చదును చేశారు. అటవీ శాఖ నుంచి అనుమతి లేకుండా చెట్లను తొలగించారు. మత్స్యశాఖ భవనం పక్కన విలువైన ప్రభుత్వ స్థలాన్ని కొందరు చదును చేసిన రెవెన్యూ అధికారులకు సమాచారం లేదు.

సిద్ధులగుట్ట వెనుక భాగాన ఉన్న ఈ స్థలాన్ని చదును చేసి ఆక్రమించు కోవడానికి ప్రయత్నాలు జరుగుతున్న పట్టణంలోనే ఉన్న రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. జాతీయ రహదారి పక్కనే ఖాళీగా ఉన్న విలువైన స్థలాన్ని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సర్వే చేయించి చదును చేసిన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డితో వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్
నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంపై హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన సన్నాహక సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నందిపేట్ సెజ్ భూముల కర్మాగారం, పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందిని సమకూర్చాలని కోరినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీనియర్ నాయకులు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, మదన్‌మోహన్, ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు బుద్ధుని జ్ఞానమార్గంలోనే ప్రయాణించాలి

- ప్రజలు చరిత్రను తెలుసుకోవాలి
- బహుజన వాది విజయ్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
ప్రజలు బుద్ధుని జ్ఞాన మార్గంలోనే ప్రయాణించాలని, ప్రజలు చరిత్రను తెలుసుకోవాలని బహుజన వాది విజయ్ అన్నారు. మండలంలోని కలిగోట్, కొలిప్యాక్, తొర్లికొండ గ్రామాల్లో యశోబుద్ధ క్యాలెండర్‌ను విజయ్ బహుజనవాది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఇంటికి బుద్ధ క్యాలెండర్‌ను అందజేస్తూ బుద్ధుడి గురించి తెలియజేయాలని అన్నారు. ప్రజలు బుద్ధుని జ్ఞాన మార్గంలోనే పయనించాలని ప్రజలు చరిత్రని తెలుసుకోవాలని సూచించారు.

నేడు దేగాంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నవతెలంగాణ-ఆర్మూర్
విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని బుధవారం ఆలూర్ మండలంలోని దేగాం గ్రామ సబ్‌స్టేషన్ నందు నిర్వహించబడునని విద్యుత్ శాఖ డీఈ హరిచంద్ మంగళవారం తెలిపారు. ఆర్మూర్, ఆలూర్ మండలాల విద్యుత్ వినియోగదారులు కరెంట్ బిల్లులపై ఉన్న సమస్యలను వెంటనే లోకల్ కోర్టు నందు పరిష్కరించుకోవాలని సూచించారు.